క్లుప్తంగా

టీడీపీ ప్రచారంలో గోపాలమిత్ర



టీడీపీ కండువాతో ఎర్రగుంట గోపాలమిత్ర ఓబయ్య

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట వెటర్నరీ ఆరోగ్య మిత్ర టీడీపీ కండువాతో ఏకంగా టీడీపీ అభ్యర్థి సురేంద్రబాబుతో ఫొటో దిగారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారాల్లో పాల్గొనకూడదనే ఆంక్షలున్నా కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. టీడీపీ తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతోపై గ్రామస్తులు రామచంద్ర, మంజు, జయసింహ తదితరులు వెటర్నరీ డాక్టర్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

ఐదోతరగతిలో ప్రవేశానికి రేపు అర్హత పరీక్ష

కుందుర్పి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే (బాలుర) పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశానికి ఈనెల 27న పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. కుందుర్పి పాత ఎస్సీ హాస్టల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. కుందుర్పి పాఠశాలకు 191 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు శనివారం ఉదయం 9 గంటలకే మహాత్మా జ్యోతిబా పూలే (బాలురు) పాఠశాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

చివరి రోజు ఐదు నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: నామినేషన్ల గడువు ముగింపు రోజు గురువారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైఎస్సార్‌సీపీ) తరఫున రామాంజనేయులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున పెరనేటి రాంభూపాల్‌రెడ్డి, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ తరఫున బంగారు గిరి ప్రసాద్ రెడ్డి, టీడీపీ తరఫున అమిలినేని సురేంద్రబాబు, స్వతంత్ర అభ్యర్థిగా నానేవత్ బలరాం నాయక్ నామినేషన్లను దాఖలు చేశారు. ఆయా పార్టీల అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణి సుస్మిత స్వీకరించారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఇన్‌ఛార్జ్ డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

డ్రిప్ పరికరాలకు నిప్పు

శెట్టూరు: మండలంలోని కనకూరులో రైతు ఈడిగ కిష్టప్పకు చెందిన డ్రిప్ పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. రెండు ఎకరాలకు సరిపడా డ్రిప్ పైపులు, 55 స్ప్రింక్లర్ పైపులు, 25 స్ప్రింక్లర్ గన్నులకు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఉదయం తోటకు వెళ్లిన రైతుకు డ్రిప్ పరికరాలు కాలిపోయాయని తెలుసుకుని, ఎస్ఐ రాంభూపాల్‌కు ఫిర్యాదు చేశాడు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎస్ఐ ఆంజనేయులు

కంబదూరు: మండలంలోని అండేపల్లి గ్రామంలో గుట్టుగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వెంకటమ్మ అనే మహిళను కంబదూరు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి మద్యం విక్రయిస్తున్న మహిళ ఇంటిపై దాడులు చేశారు. ఆమె నుంచి 40 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



తిప్పపల్లిలో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

శెట్టూరు: మండలంలోని తిప్పనపల్లి గ్రామదేవత వీర మాస్తమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్ల పరుష నిర్వహించారు. గ్రామంలోని యువకులు ఉట్లమాను ఎక్కేందుకు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఉట్లమాను జాతరను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి, పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'దుర్గం'..జనసాగరం

అసలే మండే ఎండలు.. మిట్ట మధ్యాహ్నం .. సూరీడు సుర్రుమంటున్నాడు... అడుగుతీసి అడుగేయాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి.. అయితేనేం ప్రజాభిమానం పెల్లుబికింది.. ఫ్యాన్ గాలి వీచింది. జగనన్నే మాకు అండ.. మది నిండా వైఎస్సార్‌సీపీ జెండా.. అంటూ అభిమానం తోడై.. జగనన్నకు జేజేలు చెప్పుతూ.. నీరాజనం పలుకుతూ.. నెత్తిన తువాలు చుట్టుకొని, చేతిలో జెండా పట్టుకొని, పాదం పాదం కదిలింది.. అడుగులో అడుగు పడింది.. ఊరూవాడా ఏకమైంది.. జన కెరటంలా తరలివచ్చింది.. దారులన్నీ ఏకమయ్యాయి.. రాయదుర్గం జనకెరటాన్ని తలపించింది.. కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా వచ్చిన మహిళల డప్పు వాయిద్యాలు, డ్రమ్స్, బొమ్మలు, డీజే సౌండ్స్ మధ్య యువత చిందేస్తూ బ్రహ్మరథం పట్టారు.. వినాయక సర్కిల్ వద్దకు చేరుకోగానే అభిమాన నేతలకు అభిమానులు, కార్యకర్తలు క్రేన్‌తో భారీ గజమాల వేసి స్వాగతం పలికారు. ర్యాలీలో మెట్టు తనయుడు విశ్వనాథ్‌రెడ్డి నృత్యం చేస్తూ కార్యకర్త లను ఉత్తేజ పరిచారు. జై జగన్ అంటూ పార్టీ జెండాలు ఊపుతూ, బైక్ పై ర్యాలీ చేస్తూ యువత ఆనందాన్ని పంచింది.

- కనీవినీ ఎరుగని రీతిలో అభిమాన సంద్రం
- 40 వేలకుపైగా తరలివచ్చిన జనం
- అశేష జనవాహిని నడుమ అట్టహాసంగా మెట్టు గోవిందరెడ్డి నామినేషన్
- మండుటెండను సైతం లెక్కచేయని ప్రజాభిమానం
- అడుగడుగునా జననీరా'జనం'
- 'దుర్గం' రూపురేఖలు మార్చాలన్నదే అజెండా
- ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: రాయదుర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. తొలుత పెద్ద బన్ని మహంకాళీ అమ్మవారి ఆలయంలో సతీమణి మెట్టు యశోదమ్మ, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ పరిశీలకులు పామిడి వీరాంజనేయులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి పొరాళ్ల శివాలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాంతినగర్ వద్దకు కాలినడకతో చేరుకొని ప్రత్యేకంగా సిద్ధం చేయించిన ప్రచార రథంపైకి ఎక్కారు. మండుటెండనూ లెక్క చేయకుండా నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు వేలాదిగా తరలివచ్చి మద్దతు పలికారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ర్యాలీ స్థానిక రోడ్లు, భవనాలశాఖ



ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న మెట్టు

అతిథి గృహం వద్దకు చేరుకునే సరికి మధ్యాహ్నం 2 గంటలయ్యింది. రాయదుర్గం చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అశేష జనం నామినేషన్ ఘట్టానికి తరలిరావడం ఇదే తొలిసారి కావడం విశేషం. అనంతరం 200 మీటర్ల దూరంలోనే ఆపారు. నిబంధనల ప్రకారం ఆర్వో కార్యాలయంలోకి వెళ్లారు. అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డితో పాటు ప్రతిపాదకులు డి హీరేహళ్, గుమ్మఘట్ట మండల కన్వీనర్లు బోయ వన్నూర్‌స్వామి, గౌని కాంతారెడ్డి, నేసే పొరాళ్ల శివా, మాజీ ఎంపీటీసీ కోకుర్తి ఉషారాణి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాస్‌యాదవ్లతో కలసి నామినేషన్ పత్రాలు సమర్పించారు. మెట్టు విశ్వనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ పద్మావతి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజ రాజ్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ హరిజన వన్నప్ప, మైనార్టీ నాయకుడు రహంతుల్లాతో కలసి మరో సెట్ దాఖలు చేశారు. పాటిల్ వీరభద్రారెడ్డి, అడ్వొకేట్ వెంకటరెడ్డి, వడ్రవన్నూరు ఎంపీటీసీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీటీపీకి నీరుతీసుకురాకపోతే రాజకీయ సన్యాసం..

కరువు ప్రాంత రైతుకు జీవనాడిగా చెప్పుకునే బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు తరలించి, సస్యశ్యామలం చేయాలన్నదే ప్రధాన లక్ష్యమని, మాట తప్పితే రాజకీయ సన్యాయం చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎండను సైతం లెక్కచేయకుండా నామినేషన్ కార్యక్రమానికి ఇంతపెద్ద సంఖ్యలో తరలివచ్చి గంటల తరబడి నావెంట నడిచి మద్దతు తెలపడం మరువలేనన్నారు. రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా తప్పక ఎగురవేస్తామన్నారు. జనాల్లో ఈ ఉత్సాహం చూస్తుంటే రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తానన్నారు.

ఏటీఎంగా వాడుకుని దండుకున్నారు..

చెట్టు పేరు చెప్పి కాయలు అమ్మినట్టు బీటీ ప్రాజెక్టును చూపి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు దోపిడీ చేశారని మెట్టు విమర్శించారు. టీడీపీ హయాంలో నాలుగు సార్లు సీఎం హోదాలో చంద్రబాబు, ఓ పదిసార్లు జలవనరుల శాఖ మంత్రిని రప్పించినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కేవలం హంగూ ఆర్భాటాలకే రూ.కోట్లు తగలేశారని విమర్శించారు. బీటీపీకి నీరిస్తామంటూ చంద్రబాబు మోసం చేస్తే సీఎం జగన్ ఆదుకునేందుకు చర్యలు చేపట్టారన్నారు. భూసేకరణ రైతుల కోసం సీఎం జగన్ రూ.208.8 కోట్లు మంజూరు చేసి, ఇప్పటికే రూ.130 కోట్లు జమ చేశారన్నారు. బీటీపీకి నీరు తెచ్చేది.. ఆయకట్టుకు నీటిని విడుదల చేసే సత్తా ఒక్క జగన్‌కు మాత్రమే ఉందన్నారు. 50 నుంచి 60 చెరువులు నింపేలా ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తామన్నారు. డి హీరేహళ్ మండలం జాజరకల్లు వద్ద రూ.540 కోట్లతో ఇథనల్ ఇండస్ట్రీ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన పూర్తి చేశారన్నారు. త్వరలో ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి తెస్తామన్నారు.

రాయదుర్గం రూపురేఖలు మారుస్తాం..

రాయదుర్గాన్ని ఏడాదిలోపే నాడు-నేడు తరహా రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమని మెట్టు గోవిందరెడ్డి గుర్తుచేశారు. టీడీపీ హయాంలో ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్‌కు రూ.4.50 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేశారు.. దానికి రూ.90 లక్షలు మాత్రమే ఇస్తే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మొదట బీటీ ప్రాజెక్ట్ పూర్తయితేనే ఇలాంటివి సాధ్యమౌతాయన్నారు. దశలవారీగా ఈ పనులన్నీ పూర్తి చేయిస్తామన్నారు. 36వ ప్యాకేజీ సొల్లాపురం, మాల్యం గ్రామాల వద్ద గత ఎన్నికల చివరలో కాలవ శ్రీనివాసులు జేసీబీతో హడావుడి చేసి వదిలేశారన్నారు. హరిత రాయదుర్గం పేరుతో మొక్కల పెంపకం చేపట్టి, వదిలేశారన్నారు. గుమ్మఘట్ట రోడ్డు మాత్రమే కనిపిస్తోందన్నారు. లక్షల్లో మొక్కలు నాటి రూ.లక్షలు దిగమింగారన్నారు. కణేకల్లు మండలంలో ఎడారి నివారణ అని చెప్పి మోసం చేశాడన్నారు. వాటర్ మేన్ రాజేంద్రసింగ్‌ను రప్పించి సబ్‌సర్ఫేస్ డ్యాం నిర్మాణం అంటూ శంకుస్థాపనలు చేసి వదిలేశాడని మండిపడ్డారు. నీరు-చెట్టు ద్వారా రూ.2 కోట్ల వ్యయంతో కణేకల్లు చెరువులో గడ్డ పడటం ఎంత నిజమో, రాయదుర్గంలో కాలవ ఇంటి నిర్మాణానికి కూడా అదే రోజు పునాది పడటం కూడా నిజమని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. నిజాయతీకి మారుపేరుగా చెప్పుకునే నన్ను వయసుతో సంబంధం లేకుండా బెంగళూరుకు పార్సిల్ చేస్తానని కాలవ అంటాడా? .. కాలవా.. ఖబడ్దార్.. 20 రోజుల్లో ప్రజలిచ్చే తీర్పుతో ఇక్కడి నుంచి శాశ్వతంగా అనంతపురం వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో యువతనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, ఎంజీ అమర్‌నాథ్, ఎంజీ కుశాల, జెడ్పీటీసీలు మల్లికార్జున, హసీనాబేగమ్, పద్మావతి, నీలవేణి, ఎంపీపీలు ఎం. పవిత్ర, పద్మావతి, భవాని, విద్యావతి, సంధ్య, మండల కన్వీనర్లు గౌని కాంతారెడ్డి, ఎం.వన్నూర్‌స్వామి, మల్లికార్జున, ఆలూరు చిక్కన్న, రామాంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు వలీబాషా, శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీలు గరుడచేడు రాజగోపాల్‌రెడ్డి, నాగరాజురెడ్డి, మాజీ జెడ్పీటీసీ గణిగేర నాగిరెడ్డి, ముఖ్య నాయకుడు ఎర్రగుంట కేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ అవర శివప్ప, పార్టీ నాయకులు ఆర్టీ కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పైనేటి తిమ్మప్ప, పట్టణంలోని అన్నీ వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు.



రాయదుర్గం వినాయక సర్కిల్ మీదుగా నామినేషన్‌కు తరలివెళ్తున్న అశేష జనవాహిని



జనసంద్రంగా మారిన వినాయక సర్కిల్



పెద్ద బన్ని మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మెట్టు దంపతులు, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ



మరో సెట్ నామినేషన్ వేస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి



సందడి చేస్తున్న నాయకులు



మహిళా కళాకారుల సందడి



నామినేషన్‌కు బయల్దేరుతున్న మెట్టు, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, జిల్లా అధ్యక్షులు పైలా, అబ్జర్వర్ వీరా

గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు..

రాయదుర్గం ప్రాంత ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతోనే ఎమ్మెల్యేగా బరిలో నిలిచానని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. రాయదుర్గంలో గార్మెంట్స్, కుటీర పరిశ్రమల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. టెక్స్‌టైల్స్ పరిశ్రమను హబ్‌గా తీర్చిదిద్ది, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి క్లస్టర్ యూనిట్లకు అందే 95 శాతం రాయితీలు వర్తించేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోనే రాయదుర్గానికి గుర్తింపు తెస్తామన్నారు. పట్టణంలోని ముంపు సమస్యకు రూ.20 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతామన్నారు. వ్యవసాయ రంగంలోనూ కొన్ని మార్పులు తీసుకొచ్చి రైతు జీవన విధానం మెరుగుపరుస్తామన్నారు. దేశ వ్యాప్తంగా బ్యాంబో (వెదురు) కు మంచి డిమాండ్ ఏర్పాడిందన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సుమారు రూ.20 వేల కోట్లతో 30 వేల ఎకరాల్లో నెలకొల్పేలా లక్ష్యం ఉంన్నారు. హెచ్‌హెల్‌సీ కెనాల్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మలేరియా దినోత్సవంపై ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

బొమ్మనహాళ్: దోమకాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లీశ్వరి ప్రజలకు సూచించారు. మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ గ్రామాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, ఏఎన్ఎంలు గోవర్ధన, రమణ, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని డాక్టర్ రిహ జైనం సూచించారు. గురువారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని అర్బన్ హెల్త్ క్లినిక్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. మలేరియా ఆఫీసర్ తిరుపాలయ్య, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ అబ్బాబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్ పీలు పాల్గొన్నారు.

కుందుర్పి: కుందుర్పిలో 'చిన్న దోమ పెద్ద ప్రమాదం' అనే నినాదంతో గురువారం ర్యాలీ చేశారు. వైద్యులు అనుష, నారాయణస్వామి, సిబ్బంది మధు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రం తనిఖీ

కుందుర్పి: తూముకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు సంరక్షణ కింద అందుతున్న సేవలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య మిషన్ టాస్క్‌ఫోర్స్ డాక్టర్ రవికుమార్, సిబ్బంది గోవింద గౌడ్,హేమలత, జరీనా, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

రాయదుర్గం: ఎన్నికల ప్రక్రియలో కీలకంగా చెప్పుకునే నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రధాన పార్టీలతో సహా మొత్తం 17 నామినేషన్లు దాఖలైనట్టు ఆర్వో కరుణకుమారి తెలిపారు. శుక్రవారం ఆర్వో కార్యాలయంలో ఆయా పార్టీలకు అభ్యర్థుల సమక్షంలోనే నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్లు ప్రశాంతంగా ముగిశాయని ఆర్ఓ తెలిపారు. కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు పర్యవేక్షణలో అర్బన్, రూరల్ సీఐలు శ్రీనివాసులు, ప్రసాద్‌బాబు లు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలో గురువారంతో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మొత్తం 17 నామినేషన్లు దాఖలు అయినట్లు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రాణిసుస్మిత తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి- 1, టీడీపీ- 2, బీఎస్పీ-1, జై భారత్ నేషనల్ పార్టీ -1, జైభీమ్ రావు భారత్ పార్టీ -1, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ-1, కాంగ్రెస్- 1, స్వతంత్ర అభ్యర్థులు 9 మంది నామినేషన్లు వేసినట్లు ఆర్డీఓ తెలిపారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



కంబదూరు: మండలంలోని పాళ్లూరుకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సమక్షంలో శ్రీనివాసులు, వినోద్‌కుమార్, బోయ అరుణ్, ప్రభాకర్ అనే టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పరంధామ రెడ్డి, వాల్మీకి రాజు, ఓబుళేసు పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలోని ములకనూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు దండ శ్రీరాములు, దండా తిమ్మప్ప ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గురువారం వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమా మహేశ్వరనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, సర్పంచ్ గంగాధర్, నాయకులు ములకనూరు తలారి సత్తి, చిక్క నాగన్న, సత్తి, కిష్ట, సాయినాథ్‌రెడ్డి, అండేపల్లి గాజుల రామాంజనేయులు, కుర్లపల్లి మంజునాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ సీనియర్ నాయకులకు పార్టీ కండువా వేస్తున్న ఉమా

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్: తారకాపురం గ్రామం వద్ద ఈనెల 16న ద్విచక్ర వాహనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన చాకలి ఓబులేసు (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. డి.హీరేహాళ్ మండలం తిమ్మలాపురానికి చెందిన చాకలి ఓబులేసు తారకాపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూల్ ఆస్పత్రిలోచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు భార్య లక్ష్మీ, ఒక కుమారై ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థి రోడ్‌షో

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని హులికల్లు, విట్లంపల్లి, మల్లికార్జున పల్లి, మాదిరెడ్డి పల్లి, చాపిరి, గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య శుక్రవారం రోడ్‌షో ఉంటుందని ఎంపీపీ మారుతమ్మ తెలిపారు.

నిఘా మరింత పెంచాలి

గుమ్మఘట్ట: చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలని ఐఆర్ఎస్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు వీ షిండే ఆదేశించారు. మండలంలోని కేపీ కుంట చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మద్యం, డబ్బు తరలిరాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నిఘా పెంచి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.